

రాజ్యాంగం వల్లే సమైక్యత

అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే దేశంలోని ప్రజలు సమైక్యతతో ఉన్నారని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ కె.సురేష్ బాబు అన్నారు.

-8లో



కారు, ట్రాక్టర్ ఢీ

ప్రొద్దుటూరు మండలం కామనూరు సమీపంలో ట్రాక్టర్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. రెండు వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

-8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.3/19.6

జిల్లాలో గురువారం 19.6 - 34.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

రైతు సంక్షేమానికి పెద్దపీట



జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు



పోలీసుల పరేడ్‌ను పరిశీలించి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్

- పేదలకు పక్కా గృహాలు
- పెన్షన్ కానుక రూ. 3 వేలకు పెంపు
- రూ. 27 వేల కోట్లతో భారీ పరిశ్రమలు
- 2596 ఎకరాల్లో వైజాగ్–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులు, రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు పరేడ్ మైదానంలో ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. పరేడ్‌ను పర్యవేక్షించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ ఏడాది జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పటికీ మైలవరం జలాశయం నుంచి నీటిని తీసుకొచ్చి ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట కింద ఉన్న 11 వేల ఎకరాల కేసీ కెనాల్ ఆయకట్టు పంటలను కాపాడామన్నారు. అలాగే చాపాడు చానల్ కింద రెండు వేల ఎకరాల పంటలను కాపాడామన్నారు. గండికోట ముంపు నిర్వాసితుల పరిహారం కోసం ప్రభుత్వం రూ. 454 కోట్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. జిల్లాలో 11 సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. రైతు భరోసా కింద 2023–24 సంవత్సరానికి మొదటి విడతగా రూ. 154.87 కోట్లు రైతులకు అందించామన్నారు. పంట నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీని అదే సీజన్‌లో విడుదల చేస్తున్నామన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, మందులు అందిస్తున్నామన్నారు. ఆర్బీకేల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా శనగలు, పసుపు కొనుగోలు చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 9565 కోట్ల రూపాయల పంట రుణాల లక్ష్యానికిగాను ఇప్పటికి రూ. 4823 కోట్లు రైతులకు మంజూరు చేశామన్నారు. డిసెంబరులో కురిసిన వర్షాలకు నష్టపోయిన ఉద్యాన పంటలకు రూ. 40.17 లక్షలు పరిహారం కింద రైతులకు ఇచ్చామన్నారు. వైఎస్సార్ ఆసరా కింద రూ. 471 కోట్లు అందజేశామన్నారు. పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఇప్పటికి 39042 గృహాలు పూర్తి కాగా, 61026 వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈనెల నుంచి పెన్షన్ కానుకను రూ. 3000కు పెంచామన్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. అమ్మ ఒడి, డిజిటల్ విద్య, నాడు–నేడు, గోరుముద్ద, విద్యా కానుక, వసతి దీవెన వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద రూ. 100 కోట్లతో వివిధ పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో 286 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి సెటిల్‌మెంట్ రికార్డులు తయారు చేశామన్నారు. జిల్లాలో 27 వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో ప్రతిపాదిత 13 భారీ పరిశ్రమల ద్వారా 19,126 మందికి ఉపాధి కల్పించనున్నట్లు వెల్లడించారు. వైజాగ్–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి చేయడానికి 2596 ఎకరాలను ప్రతిపాదించామని తెలిపారు. కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కులో ఎలక్ట్రానిక్ మ్యాన్‌ఫ్యాక్చర్ క్లస్టర్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఉపాధి హామీ అనుసంధానంతో 426 గ్రామ సచివాలయ భవన నిర్మాణాలు చేపట్టామన్నారు. అలాగే 417 ఆర్బీకేలు, 334 గ్రామ ఆరోగ్య కేంద్రాలు, 43 పాల సేకరణ కేంద్రాలు, 199 డిజిటల్ లైబ్రరీల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని బియ్యం కార్డుదారులందరికీ ఫోర్టిఫైడ్ బియ్యం, కంది పప్పు, చక్కెర పంపిణీ చేస్తున్నామన్నారు. ఈబీసీ నేస్తం, జగనన్న చేదోడు, కాపు నేస్తం, జగనన్న తోడు, నేతన్న నేస్తం, వాహనమిత్ర లాంటి పథకాల కింద లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం కింద ఇప్పటివరకు 60,559 అర్జీలు రాగా, అందులో 59,657 అర్జీలను పరిష్కరించామని తెలిపారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

రూ. 30.04 కోట్ల ఆస్తుల పంపిణీ

ఈ సందర్భంగా 287 యూనిట్లకు సంబంధించి 939 మంది లబ్ధిదారులకు రూ. 30.04 కోట్ల ఆస్తులను కలెక్టర్ పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ స్త్రీ నిధి, డ్వామా ద్వారా జలకళ, పశుసంవర్ధకశాఖ, వికలాంగులు, మెప్మా, మత్స్యశాఖల ద్వారా ఈ మొత్తాలను లబ్ధిదారులకు అందజేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

మున్సిపల్ హైస్కూలు, చెమ్ముమియాపేట జెడ్పీ హైస్కూల్, హ్యాపికిడ్స్ స్కూలు, చీర్‌ఫుల్ కడప, విస్‌డమ్ స్కూలు చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, గుర్రంస్వారీ ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఘనంగా అట్ హోమ్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్థానిక జిల్లా కలెక్టర్ బంగ్లా ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం 'అట్ హోమ్' కార్యక్రమం ఘనంగా జరిగింది. కలెక్టర్ విజయరామరాజు ఏర్పాటు చేసిన తేనీటి విందులో జేసీ జి.గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారుల సమన్వయంతో జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. 2024వ సంవత్సరంలో అన్ని శాఖల వారీగా అభివృద్ధి ఫలాలు సమృద్ధిగా సిద్ధించాలని కోరారు. రాష్ట్రంలో కడప జిల్లాను అభివృద్ధిలో ఓ ప్రత్యేక గుర్తింపును తీసుకురావాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను కోరారు. అనంతరం కార్యక్రమంలో ప్రొద్దుటూరు 'నృత్య తరంగిణి' అకాడమీ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం జిల్లా కలెక్టర్ వారిని అభినందించి జ్ఞాపికను బహూకరించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందుకున్న శకటాలకు సంబంధించిన అధికారులను ప్రత్యేకంగా అభినందించారు.

అబ్బురపరిచిన అగ్నిమాపక విన్యాసాలు

అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు వాటి నుంచి ప్రజలను, ఆస్తులను రక్షించుకునేందుకు, అగ్నిప్రమాదాల నివారణకై అవగాహన కల్పించేందుకు అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో ఎస్పీ సిద్దార్థ కౌశల్, అడిషనల్ ఎస్పీ తుషార్ డూడి, జేసీ గణేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భర్వదాజ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌తోపాటు ఇతర అధికారులు, నగర ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.



మార్చ్‌పాస్ట్ నిర్వహిస్తున్న పోలీసులు



అశ్వాలపై ప్రదర్శన



ఎద్దుల బండిపై రైతులు...



అగ్నిమాపకశాఖ వాహనం ద్వారా జాతీయ జెండాలోని మూడు రంగుల ప్రదర్శన

రేపటి నుంచి కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా ప్రతిష్టాత్మక కల్నల్ సీకే నాయుడు క్రికెట్ ట్రోఫీలో భాగంగా అంతర్ రాష్ట్రాల అండర్–23 క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా, చత్తీస్‌ఘర్ జట్లు తలపడనున్నాయి. ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ మ్యాచ్ కోసం ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ ఏర్పాట్లు చేసింది. మైదానాన్ని అందంగా ముస్తాబుచేశారు. ఏర్పాట్లు పూర్తయినట్లు సీఏవైడీ అధ్యక్ష, కార్యదర్శులు భరత్‌రెడ్డి, రెడ్డిప్రసాద్ తెలిపారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



జాతీయ జెండాను ఎగురవేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కారాన్ని జెడ్పీ ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది అమరులయ్యాక దేశ స్వాతంత్ర్యం లభించిందన్నారు. అప్పటి నుంచి వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, రహదారులు, మౌలిక వసతులు, అభివృద్ధి అయ్యాయన్నారు. జిల్లా పరిషత్ పరిధిలో ఆలస్యం లేకుండా కారుణ్య నియామకాల కింద ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికి 54 మందికి ఉద్యోగాలు ఇచ్చామని, 40 మందికి వివిధ క్యాడర్లలో పదోన్నతి కల్పించామని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి 22 సీపీడబ్ల్యూఎస్ పనులకు 27.19 కోట్ల రూపాయలు మంజూరు చేశామని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సాధారణ నిధుల నుంచి 114 పనులకు రూ. 2.97 కోట్లతో పరిపాలన ఆమోదం మంజూరు చేశామన్నారు. సీనరేజ్ గ్రాంటుతో 278 పనులకుగాను 9.82 కోట్ల రూపాయలు మంజూరు చేశామని వివరించారు. అనంతరం కారుణ్య నియామకాలకు సంబంధించి 10 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు మెరిట్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఉపాధ్యక్షులు బాలయ్య, సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, అకౌంట్స్ అధికారి రంగాచార్యులు, పేషీ సిబ్బంది నాగిరెడ్డి, లంకా మల్లేశ్వర్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీ

కడప కార్పొరేషన్: జిల్లాలోని పలువురు మున్సిపల్ కమిషనర్లు బదిలీ అయ్యారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వారిని బదిలీ చేస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై. శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. కడప మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న ఎన్‌వీ రమణారెడ్డి పలమనేరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న బి. జ్యోతి లక్ష్మికి కడప డిప్యూటీ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా ఉన్న వైఓ నందన్‌ను కడప మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్‌గా నియమించారు. కుడా వైస్ చైర్మన్ బాధ్యతలు అదనంగా అప్పగించారు. ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న పి. వెంకట రామయ్యను గుంతకల్ కమిషనర్‌గా నియమించారు. గుంతకల్ కమిషనర్‌గా ఉన్న వి. మల్లికార్జున ప్రొద్దుటూరు కమిషనర్‌గా బదిలీ అయ్యారు. పులివెందుల మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న వీవీ రామనరసింహారెడ్డి చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏఓగా బదిలీ కాగా, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జి. రమణారెడ్డిని పులివెందుల కమిషనర్‌గా నియమించారు. బద్వేల్ మున్సిపల్ కమిషనర్ కమిషనర్‌గా ఉన్న కేవీ కృష్ణారెడ్డిని కందుకూరు కమిషనర్‌గా బదిలీ చేసి, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో జోనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం. కృష్ణను బద్వేల్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు.

అక్కచెల్లెమ్మల మోములో చిరునవ్వే ధ్యేయం

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది, అక్కచెల్లెమ్మల ముఖాల్లో చిరునవ్వు చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వీఆర్‌యస్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వైఎస్సార్ ఆసరా సంబరాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జగనన్న ప్రజా సంకల్ప యాత్రలో డ్వాక్రా మహిళలకు తీసుకున్న రుణాలను నాలుగు విడతలుగా పూర్తిగా మాఫీ చేస్తారని హామీ ఇచ్చారని, ఆ మేరకు ఇప్పటిదాకా మూడు విడతలు ఖాతాల్లో జమ చేశారని, ప్రస్తుతం నాలుగో విడత జమ చేస్తున్నట్లు తెలిపారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు తాను అధికారంలోకి రాగానే డ్వాక్రా మహిళలు తీసుకొన్న రుణాలు, రైతులకు సంబంధించిన రుణాలు పూర్తిగా మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే కంటితుడుపు చర్యలు చేపట్టడం తప్ప రుణాలను మాఫీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అహర్నిశలు రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకొనే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మళ్లీ మోసం చేసేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామాల్లోకి వస్తారని, వారు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని తెలియజేశారు. ప్రజల కోసం పనిచేసే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలని కోరారు. టీడీపీ హయాంలో పింఛన్ మంజూరు కావాలంటే మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పార్టీలకు, మతాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందుతోందని తెలిపారు.అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాపరెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ రఘునాథరెడ్డి, ఏపీఎం బాగ్యమ్మ , పెండ్లిమర్రి ఏపీఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాజ్యాంగం వల్లే దేశంలో సమైక్యత

- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా
- వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గణతంత్రదినోత్సవం



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి గాంధీ, అంబేడ్కర్‌లకు నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం, మేయర్, నాయకులు

కడప కార్పొరేషన్ : దేశంలో ఎన్నో జాతులు, కులాలు, మతాలు, విభిన్న సంస్కృతులు ఉన్నప్పటికీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే దేశంలోని ప్రజలు సమైక్యతతో ఉన్నారని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కె.సురేష్ బాబు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో వారు గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న భారత దేశానికి స్వాతంత్ర్యం లభించినప్పటికీ.. 1950 జనవరి 26న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అమల్లోకి వచ్చిందన్నారు. బడుగు, బలహీన వర్గాలు, అణగారిన వర్గాల ప్రజలు హక్కులు పొందుతూ స్వేచ్ఛాయుతంగా జీవిస్తున్నారంటే రాజ్యాంగ ఫలితమేనని తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తి మేరకు రాష్ట్రంలో జగనన్న పాలన సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, పార్టీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, పి.జయచంద్రారెడ్డి, ఎన్.సుబ్బారెడ్డి, సుబాన్‌బాషా, త్యాగరాజు, కె.బాబు, బండి ప్రసాద్, ఆర్వీ రమణ, బాలక్రిష్టారెడ్డి, వేణుగోపాల్ నాయక్, సీహెచ్ వినోద్ కుమార్, షఫీ, పస్తం అంజి, బండి మరియలు, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

● ఉత్తమ సేవకు ప్రశంస

ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంస లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కడప పోలీస్ పరేడ్ మైదానం ఇందుకు వేదికైంది. జిల్లాలో వివిధ శాఖల్లోని అధికారులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ విజయరామరాజు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు.



కలెక్టర్ విజయరామరాజు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు



తుషార్ డూడి, అడిషనల్ ఎస్పీ | కృష్ణారావు, అడిషనల్ ఎస్పీ | మధుసూదన్, ఆర్డీఓ, కడప | శ్రీనివాసులు, ఆర్డీఓ, జమ్మలమడుగు | వెంకటరమణ, ఆర్డీఓ, బద్వేలు | వెంకటేశులు, ఆర్డీఓ, పులివెందుల | చంద్రమోహన్, డిప్యూటీ కలెక్టర్ | కౌసర్‌భాను, డిప్యూటీ కలెక్టర్



మహమ్మద్ షరీఫ్, కడప డీఎస్పీ | ప్రభాకర్‌రెడ్డి, సమగ్ర శిక్ష అభియాన్ పీఓ | బాలాంజనేయులు, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ | వెంకటేశ్వర్‌రెడ్డి, డీడీ, భూగర్భగనుల శాఖ | శ్రీనివాసులు, ఏజీఎం, నాబార్డు | సాయిగ్రేస్, స్టెప్ సీఈఓ | సుధాకర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ | వెంకట్రావు, సీపీఓ



శాంతి, డిప్యూటీ డైరెక్టర్, మత్స్యశాఖ | సరస్వతి, డీడీ, సోషల్ వెల్ఫేర్ | వెంకటేశ్వర్లు, డీడీ, ట్రెజరీ | బ్రహ్మయ్య, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, కడప | మీరా ప్రసాద్, డీటీసీ, కడప | దుర్గాప్రసాద్, ఎల్‌డీఎం | శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, కడప | యదుభూషణరెడ్డి, డ్వామా పీడీ, కడప



వేణుగోపాల్‌రెడ్డి, ఏడీ, పౌరసంబంధాలశాఖ | వెంకటసుబ్బారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్, వయోజన విద్య | సన్నన్న, డిప్యూటీ డైరెక్టర్, గ్రౌండ్ వాటర్ | నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి, కడప | శారదమ్మ, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, కడప | మంజులావాణి, జిల్లా ఆడిట్ అధికారి, కడప | సుభాషిణి, జిల్లా కో ఆపరేటివ్ అధికారి, కడప | రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి, కడప | సురేష్‌కుమార్, జిల్లా ఉపాధి కల్పనాధికారి, కడప | ధర్మారావు, అగ్నిమాపకశాఖ అధికారి, కడప



నాగార్జునరెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి, ప్రొద్దుటూరు | మైఖేల్ రాజీవ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి, కడప | విజయ్‌కుమార్, డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మాటిక్ ఆఫీసర్, కడప | విజయ్‌కుమార్, డిస్ట్రిక్ట్ మేనేజర్, ఆగ్రోస్ సంస్థ | అర్జున్‌రావు, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్, కడప | నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి | షేక్ ఇమ్రాన్, డిస్ట్రిక్ట్ మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్, కడప | ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి, కడప | శ్రీనివాసరెడ్డి, జిల్లా సెరికల్చర్ ఆఫీసర్, కడప | మురళీకృష్ణ, డిస్ట్రిక్ట్ సర్వే అండ్ ల్యాండ్ ఆఫీసర్, కడప | మల్లికార్జున, జిల్లా టూరిజం అధికారి, కడప



కృష్ణమూర్తి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ | చెన్నకేశవరెడ్డి, ఈఈ, పబ్లిక్ హెల్త్, కడప | జయలక్ష్మి, జీఎం, పరిశ్రమలశాఖ, కడప | రాముడు, మున్సిపల్ కమిషనర్, కమలాపురం | ఆనంద్‌నాయక్, డీఆర్‌డీఏ పీడీ, కడప | హేమగిరి కుమారి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, కడప | మల్లికార్జునరెడ్డి, ఎస్ఈ, జీఎన్ఎస్ఎస్ | ఎం.శోభారాణి, గూడ్స్ సర్వీస్ ట్యాక్స్ ఆఫీసర్, కడప | పీవీఎన్ బాబు, జిల్లా రిజిస్ట్రార్, కడప | ఎం.వెంకటసుబ్బయ్య, స్కౌట్ మాస్టర్, కడప | బిర్రు సురేష్‌బాబు, ప్రొటోకాల్ ఆఫీసర్, కడప ఎయిర్‌పోర్టు

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన



మున్సిపల్ కార్పొరేషన్ శకటం

కడప సెవెన్‌రోడ్స్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రగతి శకటాల ప్రదర్శన కనువిందు చేసింది. ఈ వేడుకలను కడపలోని పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించారు. పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, యువజన సర్వీసులు, రవాణా, రెవెన్యూ, దిశ, మున్సిపాలిటీ, వైద్య ఆరోగ్యం, ఐసీడీఎస్, గృహ నిర్మాణం, అటవీ, అగ్నిమాపక, విద్యుత్, నెడ్‌క్యాప్, విద్య, డ్వామా, డీఆర్‌డీఏ, మెప్మా, పశుసంవర్ధక, వ్యవసాయ తదితర శాఖలు తమ శకటాలను ప్రదర్శించాయి. వీటిలో కడప మున్సిపల్ కార్పొరేషన్ శకటానికి మొదటి బహుమతి కింద రూ. లక్ష నగదుతోపాటు ప్రశంసాపత్రాన్ని కలెక్టర్ విజయరామరాజు అందజేశారు. రెండవ బహుమతి కింద ఎన్నికల శకటం, ఐసీడీఎస్ శకటాలకు సంయుక్తంగా ఒక్కొక్కరికి రూ. 50 వేల నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు. మూడో బహుమతి కింద పీఆర్‌అండ్‌ఆర్‌డీ, వ్యవసాయశాఖ శకటాలకు ఒక్కొక్కరికి రూ. 25 వేల నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన పోలీసు డాగ్ షో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది.

● సమరయోధుల కుటుంబాలకు సన్మానం

స్వాతంత్ర్య సమరయోధులు బాలయల్లారెడ్డి కోడలు అరుణాదేవి, శేషన్న కోడలు రమాదేవి, సుబ్బయ్య సతీమణి నారాయణమ్మ, వెంకటరెడ్డి కోడలు కమలమ్మ, వెంకటసుబ్బయ్య కుమారుడు రఘురామమూర్తి, పక్కీరప్ప కుమారుడు శరత్‌బాబు, పెద్ద పిచ్చయ్య కుమారుడు రత్నయ్యనాయక్, సంజీవరెడ్డి కుమార్తె పద్మావతిలను కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఘనంగా సత్కరించారు.



స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను నమస్కరిస్తున్న కలెక్టర్ విజయరామరాజు



రవాణా శాఖ శకటం



భారత ఎన్నికల సంఘం శకటం



పంచాయతీరాజ్‌శాఖ శకటం



ఐసీడీఎస్ శకటం

నేత్రదానం



చంద్రశేఖర్ (ఫైల్)

ప్రొద్దుటూరు : పట్టణంలోని వైఎంఆర్ కాలనీకి చెందిన సీనియర్ ఆడిటర్ నాగెళ్ల చంద్రశేఖర్ (65) శుక్రవారం ఉదయం మృతి చెందారు. కొట్టి హైస్కూల్ ఉపాధ్యాయుడు దొంతు మురళి కృష్ణ విజ్ఞప్తి మేరకు స్నేహ సేవా సమితి వారికి తెలియజేసి నేత్రదానం చేయించారు. ఆడిటర్ చంద్రశేఖర్ సోదరుడు నాగెళ్ల శ్రీనివాసులు హౌస్ బిల్డింగ్ సొసైటీ సభ్యుడిగా ఉన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆడిటర్ చంద్రశేఖర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గజ్జల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు చిప్పగిరి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి పాల్గొన్నారు.

కారు, ట్రాక్టర్ ఢీకొని ముగ్గురికి గాయాలు



దెబ్బతిన్న కారు ముందు భాగం

ప్రొద్దుటూరు క్రైం : కామనూరు సమీపంలో ట్రాక్టర్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కామనూరు గ్రామానికి చెందిన రవి శుక్రవారం సాయంత్రం ట్రాక్టర్‌లో ప్రొద్దుటూరు వైపు బయలుదేరాడు. అదే సమయంలో అమృతానగర్‌కు చెందిన వీరేంద్ర, షరీఫ్‌లు కారులో దువ్వూరు వైపు బయలుదేరారు. కుందూ వంతెన దాటిన తర్వాత కామనూరు సమీపంలోకి వెళ్లగానే.. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను వారి కారు ఢీకొంది. ఈ సంఘటనలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న రవితోపాటు కారులో వెళ్తున్న షరీఫ్, వీరేంద్రలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.

ఉత్సాహంగా జంప్ రోప్ ఎంపికలు



జంప్ రోప్ పోటీల్లో క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జార్జ్ క్లబ్‌లో శుక్రవారం ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కడప జిల్లా స్థాయి అండర్-14, 17 బాలబాలికల జంప్‌రోప్ ఎంపికలు క్రీడాకారుల మధ్య ఉత్సాహంగా జరిగాయి. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 120 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. కడప ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకుని రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలని తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఆదివారం భీమవరంలో జరగనున్న రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీ అరుణకుమారి తెలిపారు. పోటీలను కన్వీనర్ శివారెడ్డి, పీడీలు మంజుల, మమత, నాగార్జున, వినోనియారాణి, అనిల్, రాజసింహా, హసీనా పర్యవేక్షించారు.

ఆదర్శ గ్రామంపై గవర్నర్ ఆరా



ఎస్.ఉప్పలపాడు గ్రామ సర్పంచ్ గురుదేవిని అభినందిస్తున్న గవర్నర్

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని ఆదర్శ గ్రామమైన ఎస్.ఉప్పలపాడు అభివృద్ధి గురించి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ గ్రామ సర్పంచ్ ఇంజేటి గురుదేవిని ఆరా తీశారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా తేనేటి విందుకు సర్పంచ్ గురుదేవిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా గవర్నర్ సర్పంచ్ గురుదేవిని ఎస్. ఉప్పలపాడు ఆదర్శ గ్రామం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజల సహకారం, రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయానంద్, సూజి సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈఓ రామ మనోహర్‌రెడ్డి గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను గవర్నర్ అభినందించారు.

నవశకం

ఉచితంగానే ధ్రువీకరణ పత్రాలు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అవసరమైన ధ్రువీకరణ పత్రాలన్నీ ఉచితంగా తీసుకోవడం జరిగింది. గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు రావాలంటే మండల కేంద్రంలో దరఖాస్తు చేసుకునేవాళ్లం. అవి ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉండేది. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అన్నీ కూడా ఉచితంగా సచివాలయం ద్వారా అందజేస్తున్నట్లు వలంటీర్ ప్రవీణ్ చెప్పాడు. దీంతో మా పిల్లలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాం. రెండు రోజుల వ్యవధిలోనే ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి.

– బాదిరెడ్డి రత్నమ్మ, కాలువపల్లె, గోపవరం మండలం, వైఎస్సార్ జిల్లా

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్లమాధ్యమంలో ప్రవేశపెట్టి పేద పిల్లలు ప్రపంచస్థాయి పోటీని తట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. 3, 4, 5 తరగతుల విలీనం ద్వారా సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను, డిజిటల్ విద్యా విధానం కోసం తరగతి గదుల్లో ఐఎఫ్‌బీ, టీవీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. నాడు-నేడుతో ఆహ్లాదకరమైన పాఠశాల వాతావరణం ఏర్పడింది.

– అన్నయ్య, బీసీ కాలనీ, గోరాన్‌చెరువు గ్రామం, గాలివీడు మండలం, అన్నమయ్య జిల్లా

సొంతిల్లు కట్టుకున్నాం



మేము తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పటికీ.. అప్పటి ప్రభుత్వంలో నాకు ఇల్లు మంజూరు కాలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఇంటితోపాటు స్థలం మంజూరైంది. ఇల్లు కట్టుకొని హాయిగా జీవిస్తున్నాము. మాకు చాలా ఆనందంగా ఉంది. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– నడివీధి శశికళ, ఎస్సీ కాలనీ, వంతాటిపల్లి, సిద్దవటం మండలం, అన్నమయ్య జిల్లా